# నిరీక్షణ

అభిలషణీయమైన ఆలోచనలను, ఏదో మంచి జరగబోతుందనే ఆశాభావాన్నే ప్రస్తుత సమాజంలో 'నిరీక్షణ' అంటున్నారు. నిరీక్షణ గురించి యిలాంటి తలంపులే బైబిల్లో కూడా కన్పిస్తాయి (లూకా 23:8 చూడండి). యూదు లేఖనాల్లో (పాత నిబంధన) నిరీక్షణ అని అనువదించిన హెబ్రీ పదాలు 'కనిపెట్టడంతో' బాటు ధైర్యంతో కూడిన నమ్మకాన్ని కూడా తెలియజేస్తాయి.

దేవుడు కాపాడి సహాయం చేస్తాడనే నమ్మకాన్ని తెలియజేయడానికి నిరీక్షణ అనే పదాన్ని వుపయోగించారు (కీర్తన 71:5; యిర్మీయా 14:8; 17:13). దేవుణ్ణి మాత్రమే విశ్వసించి ఆయనపై మాత్రమే ఆధారపడేవారిని ఆయన కాపాడి దీవించి సంరక్షింస్తుంటాడని బైబిల్లో మరికొన్ని వాక్యభాగాలు కూడా తెలియజేస్తున్నాయి (ఉదా: కీర్తన 33:18). దేవునిపై కాక మరే యితరమైన వాటిపై ఆధారపడడం వాటిపై ఆశాభావాన్ని వెలిబుచ్చడం చేటు కలిగిస్తుందని కూడా బైబిలు తెలియజేస్తుంది (నిర్గమ 20:3-5; కీర్తన 49:5-14; యెషయా 44:9-11). బబులోను చెర అనంతరం, భవిష్యత్‌కాలంలో ఇశ్రాయేలుకున్న నిరీక్షణ గురించి ఇశ్రాయేలు ప్రవక్తలు వర్ణించారు. అయితే, యీ నిరీక్షణ రాజకీయ పునఃస్థాపన కాదు గానీ హృదయ సంబంధమైన పునఃస్థాపనే (యిర్మీయా 29:10-14; 31:31-33).

దేవుని పాలనను వ్యతిరేకించేవారిని దేవుని ప్రజలను అణగద్రొక్కేవారిని దేవుడు ఓడించినప్పుడు మాత్రమే క్రొత్త జీవితం పట్ల ఇశ్రాయేలు నిరీక్షణ వాస్తవరూపం దాల్చుతుందని యేసు కాలానికి కొన్ని శతాబ్దాల ముందు నుంచీ యూదులు నమ్మడం ప్రారంభించారు. దేవుడు తన ప్రజల కొరకు ఒక క్రొత్త రాజ్యాన్ని స్థాపిస్తాడనే నిరీక్షణ దర్శన గ్రంథాల్లో ప్రధానంగా కన్పిస్తుంది (దానియేలు 7-12; జెకర్యా 9-14 అధ్యాయాలు).

క్రొత్త నిబంధనలో మరీ ముఖ్యంగా పౌలు పత్రికల్లో 'నిరీక్షణ' ముఖ్యాంశంగా కన్పిస్తుంది. పౌలు దృష్టిలో నిరీక్షణ విశ్వాసానికి ప్రేమకు సంబంధించిన అంశం. 'రక్షణ నిరీక్షణ' క్రైస్తవుని శిరస్త్రాణం; విశ్వాస ప్రేమలు క్రైస్తవుని కవచం (1 థెస్స 5:8). విశ్వాసాన్ని మన ప్రభువైన యేసుక్రీస్తులో వున్న నిరీక్షణతో కూడిన ఓర్పుతో పౌలు పోలుస్తున్నాడు (1 థెస్స 1:2-3). విశ్వాసం నిరీక్షణ ప్రేమ - ఈ మూడింటి ఉదాత్త వర్ణన 1 కొరింథీ 13:13లో కన్పిస్తుంది. దేవుడు యేసును మరణం నుంచి లేపాడు గనుక యేసును నమ్మేవారు కూడా ఆయనతో నిరంతరం జీవించడానికి లేస్తారనే నిరీక్షణ గురించి పౌలు చెబుతున్నాడు (1 థెస్స 4:13-18).

పాపాల నుంచి మనుషులను విడిపించి వారిని దేవుడు అంగీకరించేలా చేయడానికి యేసు సిలువపై మరణించాడు (రోమా 3:25,26). ఈ వాగ్ధానాన్ని విశ్వసించినవారు సహితం తమ రక్షణ పరిపూర్ణమై దేవుని మహిమలో పాలుపంచుకొనేవరకు యెడతెగని నమ్మకంతో కనిపెట్టవలసి వుంది (రోమా 5:1-5; 8:23-25; ఫిలిప్పీ 3:10-14). పాత నిబంధనలో లాగానే క్రొత్త నిబంధనలో కూడా దేవుని ప్రజలకున్న అసమానమైన నిరీక్షన వారిని తుదముట్టుకు పవిత్రంగా కాపాడుతుంది. పైగా, దేవుని ప్రజలు నిరీక్షించేవాటిని నిశ్చయపరచి చూపించేది వారి విశ్వాసమే కాబట్టి (హెబ్రీ 11:1) విశ్వాసం నిరీక్షణకు ఆధారమైతే, విశ్వాసాన్ని దృఢపరచ డానికి శ్రమల్లో శోధనల్లో క్రీస్తు అనుచరులను ధైర్యాన్నివ్వడానికి నిరీక్షణ అవసరమౌతుంది (1 పేతురు 1:3-9; 3:1416).